క్లుప్తంగా

శివపార్వతుల కల్యాణం



నల్లబెల్లి : మహాశివరాత్రిని పురస్కరించుకుని మండలంలోని గుండ్లపహాడ్‌లోని రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శివ పార్వతుల కల్యాణం నిర్వహించారు. అర్చకుడు బెలిగినిమతం రాజకోటయ్య గణపతిపూజ, పుణ్యాహవచనం, మండపారాధన, రుద్రహోమం చేయించారు. కల్యాణానికి గోవింద్ రంజిత్, జంగిలి రమణారావు, కడుదూరి శ్రీనివాస్, దురిశెట్టి కుమార్, కూస కుమార్, పడాల రాజు, పడాల అనిల్, గుండె బోయిన అశోక్, పొన్నం రాజ్‌కుమార్, మంజు, తదితరులు పాల్గొన్నారు.

సంఘమేశ్వరాలయంలో..



సంగెం : మండల కేంద్రంలోని శ్రీగంగా భవానీ సమేత సంఘమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. అర్చకుడు అప్పె నాగేంద్రస్వామి ఆధ్వర్యంలో మంగళవారం నిత్య పూజలు, గణపతి నవగ్రహ రుద్ర పంచాయతన మూల మంత్ర హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

నాగేంద్రస్వామికి పూజలు



గీసుకొండ : మండలంలోని ఊకల్‌హవేలీలోని నాగ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్ష ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి విగ్రహాన్ని పూలతో అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి సతీసమేతంగా ఆలయాన్ని దర్శించి స్వామి వారికి మొక్కులు చెల్లించారు.

బీఆర్‌ఎస్ కమిటీ అధ్యక్షుడిగా శ్రీధర్



నల్లబెల్లి : బీఆర్‌ఎస్ పార్టీ రేలకుంట గ్రామ కమిటీ అధ్యక్షుడిగా గండు శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు మండలంలోని ఆ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి ప్రకటించారు. తొలుత సారంగపాణి మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. నాయకులు, కార్యకర్తలు గ్రామంలో పర్యటిస్తూ పార్టీ బలోపేతానికి పాటుపడాలని కోరారు. అనంతరం శ్రీధర్ మాట్లాడారు. తన నియామకం కోసం కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

కరపత్రాల ఆవిష్కరణ



పర్వతగిరి : మండల కేంద్రంలో ఈనెల 28న తలపెట్టిన తెలంగాణ అంబేద్కర్ సంఘం మండల స్థాయి సమావేశానికి సంబంధించిన కరపత్రాలను స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడారు. సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్, జిల్లా కన్వీనర్ తాటికాయల వివేకానంద, కోకన్వీనర్ జంగిలి భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్ల పంపిణీ

నల్లబెల్లి : తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సమకూర్చిన పరీక్ష ప్యాడ్లు, పెన్నులను స్థానిక కేజీబీవీలో 10వ తరగతి విద్యార్థులకు తహసీల్దార్ కృష్ణ మంగళవారం పంపిణీ చేసి మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రత్యేక అధికారి సునీత, వేదిక నిర్వాహకుడు బట్టు సాంబయ్య, ఆర్‌పి కార్తీక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌లో గ్రీన్ ఫీల్డ్ హైవేలో భూములు కోల్పోతున్న తమను ఆదుకోవాలని కోరుతూ రైతులు తహసీల్దార్ వెంకటస్వామికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. రైతుబంధు తొలగించే దిశగా సర్వే కోసం గ్రామానికి రెండ్రోజులుగా ఏఈఓలు వస్తుండగా అడ్డుకుంటున్నట్లు తెలిపారు. భూములకు ప్రభుత్వం ప్రకటించిన ధర సరిపోవడం లేదన్నారు. తాము కోర్టుకు సైతం వెళ్లినట్లు తెలిపారు. కేసు కోర్టులో ఉండగా సర్వేకు ఏఈఓలను పంపడం సరికాదన్నారు.

సంపదలిచ్చే ఈశ్వరుడు

- కోరిన వారికి కొంగుబంగారం సంఘమేశ్వరుడు
- త్రిముఖ స్వరూపం అపూర్వం



ఆలయంలోని త్రిముఖాకార పుట్టులింగం

సంగెం : నమ్ముకుని నియమ నిష్టలతో పూజించే భక్తులకు సకల సంపదలిచ్చే ఈశ్వరుడే సంఘమేశ్వరుడుగా మండల కేంద్రంలో వెలిశాడని ప్రతీతి. త్రిగుణాత్మక స్వరూపంగా పరమేశ్వరుడు వెలసిన ప్రదేశం ఆపన్నులకు ఆశ్రయం కల్పించింది. ఈశ్వరాజ్ఞతో అక్కడకు చేరుకున్న భక్తులంతా 'సంగం'గా జీవిస్తామని మాట ఇచ్చి స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారని చరిత్ర చెబుతోంది.

నాలుగున్నర శతాబ్దాల ఏర్పాటైన 'సంగం' కాలక్రమేణా వాడుకలో 'సంగెం'గా పిలవబడుతూ చరిత్రలో నిలిచిపోయింది. సంగెంగా పిలవబడుతుంది. ఇక్కడ నెలవైన సంఘమేశ్వరుడి లీలలకు సంబంధించి ఆసక్తికరమైన కథనం ప్రచారంలో ఉంది. కాకతీయుల కాలంలో 1562లో తీవ్రమైన దుర్భిక్షం ఏర్పడగా ప్రజలకు ఈతి బాధలు తప్పలేదు. సొంత ఊరైన గణపురంలో తినడానికి తిండి గింజలు, తాగడానికి నీరు సైతం దొరకని స్థితిలో ప్రజలు పొట్టనింపుకోవడం కోసం వలస వెళ్తూ తలోదారి పట్టారు. అలా రోజుల తరబడి అరణ్యంలో ప్రయాణించినా తినడానికి పండ్లు, ఫలాలు, తాగడానికి నీరు లభించలేదు. నీరసించిపోయిన జనం అలసటతో ఓ చెట్టు నీడన సేదతీరగా ఆ రాత్రి సదరు వలస గుంపులోని కులపెద్దలకు ఓ పండు ముదుసలి స్వప్నంలో కనిపించి 'నాయనలారా చింతించకండి.. ఓరుగల్లు నుంచి తూర్పు దిక్కుగా 14 మైళ్లు ప్రయాణిస్తే తటాకం కనిపిస్తుంది. సమీపంలోని పరుపుబండపై నా పాదాల గుర్తులుంటాయి. దానికి తూర్పు దిశలో నేను సంఘమేశ్వరుడిగా వెలిశానని' చెప్పినట్టు ప్రచారంలో ఉంది. కుల పెద్దల ద్వారా స్వప్న వత్తాంతం తెలుసుకున్న ప్రజలు ఆ దిశగా ప్రయాణించి తటాకాన్ని చేరుకుని దప్పిక తీర్చుకోగా సమీపంలోనే తలతలా మెరుస్తూ సానవట్టంపై లింగం దర్శనమిచ్చినట్టు తెలుస్తోంది. పరిశీలించి చూడగా స్వామి త్రిముఖాకారుడై కొలవై ఉన్నట్టు కథలు కథలుగా చెప్పుకుంటారు. అనువైన ప్రదేశంలో ప్రతిష్ఠించాలని భావించిన ప్రజలు లింగాన్ని కదిలించడానికి ప్రయత్నించినా వీలు కాకపోవడంతో చుట్టూ చాలా లోతు తవ్వి చూసినా అంతు దొరకలేదు. దీంతో పుట్టు లింగంగా ఈశ్వరుడే అక్కడ వెలిశాడని నిర్ధారించుకున్నారు. ఆ సమీపంలోనే గుడిసెలు వేసుకుని పరమేశ్వరుడిని పూజించసాగారు. ఆ విధంగా సంఘమేశ్వరుడు వెలసిన చోటే ప్రజలంత సంఘంగా ఏర్పడి జీవించసాగారు. అదే కాలక్రమేణా 'సంగెం'గా వాడుకలోకి వచ్చింది. నేటికి లింగం చుట్టూరా నీరు చేరితేనే చెరువు మత్తడి పడుతుండడం గమనార్హం. పుట్టు లింగంగా వెలసిన స్వామి మహిమాన్వితుడని భక్తుల అపార నమ్మకం. మహాశివరాత్రి రోజున జరిగే జాతరకు ఉమ్మడి వరంగల్, కరీంనగర్, హైదరాబాద్, ఖమ్మం తదితర జిల్లాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లిస్తారు. సంగెంతోపాటుగా చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలకు సంఘమేశ్వరుడే ఇలవేల్పు. గ్రామంలో ఎవరింట్లో శుభకార్యం జరిగినా మొదట సంఘమేశ్వరుడిని దర్శించుకుని దీవెనలు తీసుకోవడం ఆనవాయితీగా వస్తోంది.



సంగెం : మండల కేంద్రంలోని సంఘమేశ్వరాలయం

ఆలయాల ముస్తాబు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లావ్యాప్తంగా మహాశివరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. నర్సంపేట, సంగెం, వర్ధన్నపేట, చెన్నారావుపేట, తదితర మండలాల్లోని శివాలయాలను విద్యుద్దీపాలతో అలంకరించారు. తాగునీటి, ఇతర వసతులు కల్పించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించనున్నారు.



నర్సంపేట : పట్టణంలోని శివాలయం



సంగెం : ఎల్గూర్ రంగంపేటలోని లక్ష్మీగణపతి సహిత రామలింగేశ్వరాలయం



చెన్నారావుపేట : స్థానిక సిద్ధేశ్వరాలయం

పంచాయతీలకు నిధులు విడుదల చేయాలి

- ఫోరం జిల్లా అధ్యక్షుడు యాకూబ్

వర్ధన్నపేట : జిల్లాలోని గ్రామ పంచాయతీలకు నిధులు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుగులోతు యాకూబ్ కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలోని బృందం జిల్లా కలెక్టర్ సత్యశారదను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేసింది. అనంతరం యాకూబ్ మాట్లాడారు. పంచాయతీ పాలకవర్గాల పదవీ కాలం ముగియడంతో సుమారు ఏడాదిన్నరగా నిధులు నిలిచిపోయాయని తెలిపారు. ఈ క్రమంలో చెక్కుల చెల్లింపులు నిలిచిపోయి పంచాయతీల నిర్వహణ భారం కార్యదర్శులపై పడిందని తెలిపారు. పంచాయతీలకు ట్రాక్టర్ నిర్వహణ, డీజిల్, మరమ్మతులు, ఇతర విధులు నిర్వహణ భారంగా పరిణమించిందని ఆందోళన వెలిబుచ్చారు. సత్వరమే నిధులు విడుదల చేసేలా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో ఫోరమ్ ప్రతినిధులు దయ్యాల సదానందం, పోలు రాజేంద్రప్రసాద్, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో తనిఖీ



దుగ్గొండి : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ప్రకాశ్ మంగళవారం తనిఖీ చేశారు. వివిధ రకాల రికార్డులతోపాటు ఉద్యోగుల హాజరు, ఓపీ రిజిస్టర్లను పరిశీలించారు. విధులకు హాజరు కాని ఉద్యోగుల వివరాలు నమోదు చేసుకున్నారు. జ్వరాలు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఉద్యోగులకు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి కిరణ్‌రాజ్, సలోమి, సాంబయ్య, ఉష, స్టాఫ్ నర్సు సబిత, తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు ఖాయం

- ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంపీడీఓ, తదితరులు

నెక్కొండ : విద్యార్థులు ప్రణాళికతో చదివితే సత్ఫలితాలు సాధించడం ఖాయమని ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్/కాలేజీలో మంగళవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలను ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగి ఉండాలని, ప్రణాళికాయుతంగా చదవాలని సూచించారు. తద్వారా మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తుండడం అభినందనీయమని చెప్పారు. ఎంఈఓ రత్నమాల మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా సూచనలు, సలహాలు అందిస్తున్నారని చెప్పారు. ఎలాంటి భయాందోళన అవసరం లేదన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా చదువుకోవాలని, ఒత్తిడికి గురి కావద్దని సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రణయ్‌కుమార్, ట్రెయినీ ఎస్సై మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో తనిఖీ



నల్లబెల్లి/సంగెం : ఈనెల 27న జరుగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక జరగనున్న నేపథ్యంలో నల్లబెల్లి, సంగెం మండల కేంద్రాల్లోని ప్రభుత్వ హైస్కూళ్లలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఆయా తహసీల్దార్లు కృష్ణ, గనిపాక రాజ్‌కుమార్ మంగళవారం వేర్వేరుగా తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రంలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఉపాధ్యాయులు ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమాల్లో ఆర్‌ఐలు కార్తీక్, బాలాజీ, హెచ్‌ఎం వసంత, సర్వేయర్ మల్లయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్య పరిరక్షణ

- ఇన్‌స్టిట్యూట్ కోఆర్డినేటర్ రాజు



సమావేశంలో మాట్లాడుతున్న రాజు

నర్సంపేట : పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవచ్చని ఇన్‌స్టిట్యూట్ ఫర్ గ్లోబల్ డెవలప్‌మెంట్ జిల్లా కోఆర్డినేటర్ నల్లవెల్లి రాజు తెలిపారు. పట్టణంలోని శాంతి మహిళా సమైక్య కార్యాలయంలో ఆశీర్వాద్ స్మార్ట్ ఇండియా ఆధ్వర్యంలో పోషకాహార ప్రాముఖ్యత, అయోడిన్ లోపం, రుగ్మతల నివారణపై మంగళవారం నిర్వహించిన కార్యక్రమానికి రాజు హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలు కార్బోహైడ్రేట్స్, విటమిన్లు, మినరల్స్, ఫ్యాట్, తదితర పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఐరన్ లోపం వల్ల గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలు రక్తహీనతకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. థైరాయిడ్ గాయిటర్ వంటి దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఆకు కూరలు, కూరగాయలు, పండ్లు, పళ్ల రసాలు, పాలు, పెరుగు, మజ్జిగ, చేపలు, చికెన్, కోడిగుడ్లు, రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటివి ఆహారంలో తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్లు ఉష, కొమ్ముల శివాజీ, కొత్తపల్లి విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట ప్రభుత్వ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులే ఉపాధ్యాయులై ఆకట్టుకున్నారు. స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు నిర్వహించగా డీఈఓగా గణేశ్, హెచ్‌ఎంగా మానస, ఉపాధ్యాయులుగా ఐశ్వర్య, తేజశ్రీ, తన్వేశ్ వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు వెంకటరమణ, కృష్ణమూర్తి, హరి, బండారి భిక్షపతి, శ్రీనివాస్, షాహెద తసీమ్, మధుబాబు, రాములు, తదితరులు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మలు పడి కూలీ మృతి



రవి (ఫైల్)

నర్సంపేట రూరల్ : చింత చెట్టు నరుకుతుండగా కొమ్మలు మీద పడి కూలీ మృతి చెందిన ఘటన నర్సంపేట మండలంలోని మాదన్నపేటలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన చుంచు రవి (35) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలోని పెద్ద చింతచెట్టు కొడుతుండగా ప్రమాదవశాత్తు కొమ్మలు ఛాతీ మీద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

బైక్ నుంచి పడి మహిళ...

నెక్కొండ : ప్రమాదవశాత్తు బైక్ మీద నుంచి పడి మహిళ మృతి చెందిన ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గూడూరు మండలంలోని రాంసింగ్‌తండాకు చెందిన తేజావత్ బాలి (42) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. అదే తండాకు చెందిన ఫొటోగ్రాఫర్ బోడ రమేశ్ ద్విచక్ర వాహనంపై నెక్కొండకు వస్తుండగా మండల కేంద్రంలోని ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ప్రమాదవశాత్తు బైక్ మీద నుంచి కింద పడి తీవ్ర గాయాలపాలైంది. ఆమెను 108 అంబులెన్స్‌లో తొలుత నర్సంపేట ఏరియా ఆస్పత్రికి, తదనంతరం పరిస్థితి విషమించడంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ క్రమంలో బాలి చికిత్స పొందుతూ మృతి చెందింది. రమేశ్ అజాగ్రత్త వల్లే తన తల్లి మృతి చెందిందంటూ బాలి కుమారుడు గురుప్రసాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై మహేందర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న గీత కార్మికుడు మృతి



వెంకన్న (ఫైల్)

ఖానాపురం : చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని బుధరావుపేటలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. బుధరావుపేటకు చెందిన ఆకుల వెంకన్న (59) గీత వృత్తి చేస్తూ కుటుంబాన్ని పోషించు కుంటున్నాడు. ఈనెల 21న ఐనపల్లి శివారులోని తాటిచెట్టు ఎక్కి రోడ్డు దాటుతుండగా అశోక్‌నగర్‌కు చెందిన ఓ వ్యక్తి నడుపుతున్న ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. వెంకన్నకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆయన్ను నర్సంపేట ఏరియా ఆస్పత్రిలో చేర్చారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. వెంకన్న చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రఘుపతి తెలిపారు.

ముగ్దుంపురంలో..

చెన్నారావుపేట : మండలంలోని ముగ్దుంపురం గ్రామానికి చెందిన చింతకాయల రాజశేఖర్ సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు ఆయన్ను హనుమకొండలోని ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రాజేశ్‌రెడ్డి తెలిపారు.

ఉప్పరపల్లిలో..

మండలంలోని ఉప్పరపల్లికి చెందిన పల్లకొండ లాలుప్రసాద్ ఈనెల 23న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు నర్సంపేటలోని ఆస్పత్రిలో చేర్చగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

'తలనీలాలు..' నిందితులపై చర్యలు తీసుకోవాలి

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ యాకూబ్ బాబా దర్గాలో తలనీలాలు అమ్మిన, కొన్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్‌కు రివల్యూషనరీ సోషలిస్టు పార్టీ (ఆర్‌ఎస్‌పీ) జిల్లా కార్యదర్శి వల్లందాస్ కుమార్ మంగళవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. నిబంధనల ప్రకారం టెండర్ ద్వారా తలనీలాలు వేలం వేయాల్సి ఉండగా దర్గా అధికారులు దళారులతో కుమ్మక్కై రూ.60 లక్షలు కాజేసినా ఇప్పటివరకు నిందితులను గుర్తించకుండా కాలయాన చేస్తున్నారని తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

- కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

రాయపర్తి : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలని కాంగ్రెస్ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆమె హాజరై మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం గణేశ్‌కుంటతండాలో నిర్వహించిన దుర్గమ్మ ఉత్సవాల్లో పాల్గొని దుర్గమ్మ, హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి, మార్కెట్ వైస్‌చైర్మన్ కృష్ణారెడ్డి, సోమనాథ ఆలయ చైర్మన్ కృష్ణమాచార్యులు, గోవర్ధన్‌రెడ్డి, ముద్రబోయిన వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై అవగాహన అవసరం

- గ్రామీణ వికాస్ బ్యాంక్ ఆర్‌ఓ వెంకటాచారి



విద్యార్థికి హాట్‌బాక్స్ అందజేస్తున్న వెంకటాచారి

సంగెం : విద్యార్థులు సామాజిక అంశాలపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని గ్రామీణ వికాస్ బ్యాంక్ రీజినల్ ఆఫీసర్ (ఆర్‌ఓ) వెంకటాచారి తెలిపారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో విద్యార్థినులకు 'బాలికల సాధికారత', 'సైబర్ క్రైమ్' అంశాలపై మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థి సింధూజ ప్రథమ, 7వ తరగతి విద్యార్థి అశ్విత ద్వితీయ బహుమతి సాధించగా వారికి హాట్ బాక్సులు, ఇతరులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం ఆర్‌ఓ వెంకటాచారి మాట్లాడారు. విద్యార్థినులు కేవలం చదువులకే పరిమితం కాకుండా సాధికారత, సైబర్ క్రైమ్, తదితరాలపైనా అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని చెప్పారు. ఆటపాటల్లోనూ రాణించాలని కోరారు. కార్యక్రమంలో బ్యాంకు శాఖ మేనేజర్ వెంకయ్య, విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ నీలిమ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్

వర్ధన్నపేట : విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ఎస్‌ఎఫ్‌ఐ పోరాడుతోందని జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. ఇప్పటివరకు విద్యాశాఖకు మంత్రిని నియమించలేదని ఆందోళన వెలిబుచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. విద్యారంగంలో నెలకొన్న అన్ని సమస్యలనూ తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా ఇస్లావత్ కల్యాణ్, నాంపల్లి శివకుమార్, సహాయ కార్యదర్శిగా కార్తీక్, ఉపాధ్యక్షులుగా రాపోలు రాంచరణ్ తేజ, సిద్ధు, సభ్యులుగా ఉమేష్‌చంద్ర, వంశీ, హరీశ్, నితిన్, సాయి నవీన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో నాయకులు సాంబరాజు, వంశీ, సాయికుమార్, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో విద్యార్థుల ప్రతిభ

చెన్నారావుపేట : మండలంలోని సిద్ధార్థ హైస్కూల్ విద్యార్థులు శ్రీనివాస రామనుజన్ రాష్ట్రస్థాయి గణిత సైన్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ చాటినట్టు ఆ విద్యాసంస్థల చైర్మన్ గోపాల్‌రెడ్డి తెలిపారు. విద్యార్థులను స్కూల్ ఆవరణలో ఆయన మంగళవారం అభినందించారు. విద్యార్థులు శశాంక్ గణితంలో రాష్ట్రస్థాయి 4వ, లక్ష్మీ త్రిపుర 6వ ర్యాంకు, జి సిద్దార్థ జిల్లాస్థాయిలో 2వ ర్యాంకు, ఆది ముఖేశ్ సైన్స్‌లో జిల్లాస్థాయి 3వ ర్యాంకు సాధించారని చెప్పారు. జిల్లాస్థాయి కన్సోలేషన్ విభాగంలో సంతోశ్, ధరణిప్రియ, సింధు, జస్వంత్, వైశాలి, శ్రీజ ప్రతిభ కనబర్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ (ఎస్‌ఆర్‌ఎఫ్) కోఆర్డినేటర్ వేణు, ఉపాధ్యాయులు మేడి రమేశ్, నవీన్‌కుమార్, శ్రీను, రమాదేవి, గణేశ్, వైనాల రాజు, సృజన, జ్యోతి పాల్గొన్నారు.

సేవా దృక్పథం అలవర్చుకోవాలి

పర్వతగిరి : యువత సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలని ఎడ్యుకేట్ ఏ జనరేషన్ ఆర్గనైజేషన్ నిర్వాహకుడు, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా కోరారు. ప్రముఖ సామాజిక కార్యకర్త గారె జయరాజ్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు చదువుకునేందుకు సహాయం అందించడానికి ఎల్లవేలలా అందుబాటులో ఉండాలని సూచించారు. మండల కేంద్రంలో విద్యార్థుల కోసం నిర్వహించనున్న పలు కార్యక్రమాల గురించి చర్చించి సలహాలు, సూచనలు అందజేశారు. సమావేశంలో నాయకులు దబ్బెట యాలాద్రి, జంగిలి యాకయ్య, జెరిపోతుల వంశీకృష్ణ, సురేందర్, తేజ, ఠాకూర్, ప్రదీప్, కలాం, తదితరులు పాల్గొన్నారు.

నర్సిరెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి

- ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి రమేశ్

నర్సంపేట : ఎమ్మెల్సీగా యూటీఎఫ్ అభ్యర్థిగా బరిలో నిలిచిన అలుగుబెల్లి నర్సిరెడ్డిని గెలిపించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ కోరారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న నర్సిరెడ్డి ఎమ్మెల్సీగా ఆరేళ్లపాటు ఉపాధ్యాయుల, విద్యారంగ సమస్యలపై శాసన మండలిలో పోరాడినట్టు తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న, విద్యారంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి గళమెత్తారని చెప్పారు. ఇద్దరు ముఖ్యమంత్రుల హయాంలో సమస్యల పరిష్కారానికి పాటుపడ్డారని తెలిపారు. నర్సిరెడ్డికి సమస్యలపైనా, సమాజ పురోగతిపైనా సమగ్ర అవగాహన ఉందని చెప్పారు. ఈ క్రమంలో నర్సిరెడ్డికి పార్టీ మద్దతు ఇస్తోందన్నారు. నర్సిరెడ్డికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని ఉపాధ్యాయులను కోరారు.